క్లుప్తంగా

'పరిష్కార వేదిక'కు 12 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీరామమూర్తి

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 12 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జి.శ్రీరామమూర్తి స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లను వెంటనే అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజారుకు సెలవు నేడు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారుకు మంగళవారం సెలవు కారణంగా బుధవారం తెరవబడుతుంది. వారం రోజుల పాటు రైతులు దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్న నేపథ్యంలో ఒక రోజు వారి కోసం సెలవు దినంగా మార్కెటింగ్ శాఖ ప్రకటించింది. చాలా మంది వినియోగదారులకు ఈ విషయం తెలియక మంగళవారం నాడు రైతుబజారుకు వస్తున్నారు. ప్రతి మంగళవారం సీతమ్మధార రైతుబజారుకు సెలవుగా అధికారులు ప్రకటించారు.

రైల్వేస్టేషన్‌లో 10 కిలోల గంజాయి పట్టివేత


గంజాయి రవాణాదారులతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో సోమవారం గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో పలు ప్లాట్‌ఫారాల్లో సోమవారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్ఐ జేకే మీనా, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. పలువురు లగేజీలను తనిఖీ చేసే సమయంలో రాజస్థాన్‌కు చెందిన నందకిషోర్, శ్రీరామ్ బిజార్నియాలు అక్రమంగా గంజాయిని తరలించడం గుర్తించారు. వీరి వద్ద నుంచి సుమారు రూ.50 వేల విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని సీజ్ చేసి, నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

గోధుమపిండి టెండర్లలో అవకతవకలు

- రద్దు చేయాలని మిల్లర్ల డిమాండ్

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గోధుమ పిండి కోసం దాఖలైన షార్ట్ టెండర్లను సోమవారం రహస్యంగా తీసి, పాత వారికే కట్టబెట్టారని ఏపీ రోలర్ ఫ్లోర్ మిల్ అసోసియేషన్ నాయకులు ఆరోపించారు. ఈ టెండర్లు దాఖలు చేసిన వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా సోమవారం అమరావతి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ కార్యాలయంలో రహస్యం టెండర్లు తెరిచారని, దీని వల్ల తాము ఎంతో నష్టపోయామని అసోసియేషన్ నాయకులు విశాఖలోని పేర్కొన్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం నాయకులు దృష్టి సారించి, టెండర్ల అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.



పేదలకు దూరంగా వైద్యం

- ఆరోగ్య కేంద్రాల్లో అరకొరగా వైద్య సేవలు
- స్పెషలిస్ట్ వైద్యుల సేవలను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- మళ్లీ మొదలైన రోగుల కష్టాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పేదలకు వైద్య సేవలు అరకొరగా అందుతున్నాయి. ఇప్పటికే స్పెషలిస్ట్ వైద్యుల సేవలు నిలిచిపోయాయి. దీంతో రోగులు మళ్లీ కేజీహెచ్‌కు పరుగులు తియ్యాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019 నుంచి 2024 వరకు సుపరిపాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల వైద్యానికి అత్యంత ప్రాధాన్యమిచ్చింది. వాడవాడలా ఆరోగ్య కేంద్రాలను నిర్మించి, అభివృద్ధి చేసి విలువైన వైద్య సేవలను ప్రజలకు ఉచితంగా అందజేసింది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం యూపీహెచ్‌సీల్లో స్పెషలిస్ట్ వైద్యుల సేవలను నిలిపివేయడంతో రోగుల కష్టాలు మళ్లీ మొదలయ్యాయి.


43వ వార్డు శ్రీనివాసనగర్‌లో ఆరోగ్య కేంద్రం

సీతమ్మధార/సీతంపేట: గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఉత్తర నియోజకవర్గంలోని ఆరోగ్య కేంద్రాలు రోగులకు విశేషంగా వైద్య సేవలందించేవి. ఇక్కడ గతంలో ఉన్న నాలుగు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించారు. రూ.6 కోట్లతో కొత్తగా మరో ఏడు ఆరోగ్య కేంద్రాలను నిర్మించి ప్రజల చెంతకు తీసుకొచ్చారు. రెగ్యులర్ వైద్యుడితోపాటు రోజుకొక స్పెషలిస్ట్ డాక్టర్ ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. దీంతో స్పెషలిస్ట్‌ల కోసం కేజీహెచ్‌కు వెళ్లకుండానే వార్డులో కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా వైద్య సేవలను మెరుగుపర్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే స్పెషలిస్ట్ వైద్యులను తొలగించారు. దీంతో వైద్య సేవలు అందక ఇబ్బంది పడుతున్నామని రోగులు వాపోతున్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మన్‌మోహన్


రేసపువానిపాలెం ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న ప్రజలు

స్పెషలిస్ట్ వైద్యులు అవసరం

జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్యుల సేవలను నిలిపివేయడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో సోమవారం ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్.. మంగళవారం జనరల్ మెడిసన్, జనరల్ సర్జన్, ఆప్తమాలజీ, పీడియాట్రిక్స్.. బుధవారం పల్మనాలజీ, డెర్మటాలజీ, ఈఎన్‌టీ.. గురువారం గైనకాలజిస్ట్.. శుక్రవారం ఆప్తమాలజీ.. శనివారం జీరియాట్రిక్స్ వైద్యులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రోగులకు అందుబాటులో ఉంటూ సేవలందించే వారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక స్పెషలిస్ట్ వైద్యులను తొలగించడంతో పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక సేవలు నిలిచిపోయాయి. దీంతో స్థానికులు, రోగులకు కష్టతరంగా మారింది. ఎక్కడికి వెళ్లి అవసరమైన వైద్యం చేయించుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ వార్డులో గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్, జనరల్ వైద్యుల సేవలు తప్పనిసరిగా అవసరమని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్పెషలిస్ట్ వైద్యులను కొనసాగించాలని కోరుతున్నారు.

నెల రోజులుగా ఇబ్బందులు

జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని దాడి రామ్మూర్తి కల్యాణ మండపంలో గల నరసింహనగర్ ఆరోగ్య కేంద్రంలో స్పెషలిస్ట్ వైద్యుల సేవలు నిలిచిపోయాయి. నెల రోజుల నుంచి 42, 43, 44, 45, 26 వార్డుల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మళ్లీ పాత రోజుల్లో మాదిరిగా కేజీహెచ్‌కు పరుగులు తియ్యాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్పెషలిస్ట్ వైద్య సేవలపై ప్రభుత్వం పునరాలోచించాలని ప్రజలు కోరుతున్నారు.


24వ వార్డు రేసపువానిపాలెంలో పట్టణ ఆరోగ్య కేంద్రం

ప్రత్యేక వైద్యులను నియమించాలి



రేసపువానిపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్యులను మళ్లీ నియమించాలి. గతంలో స్పెషలిస్ట్ వైద్యులు ఉండేవారు. వారి ఇప్పుడు లేకపోవడంతో కష్టంగా ఉంది. గతంలో వృద్ధులు ఈ ఆరోగ్య కేంద్రంలో చూపించుకునేవారు. ఇప్పుడు ప్రత్యేక వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి స్పెషలిస్ట్ వైద్యుల సేవలను కొనసాగించాలి.

మణికంఠ, నక్కవానిపాలెం

వైద్యులు లేక ఇబ్బందులు



రేసపువానిపాలెం ఆరోగ్య కేంద్రంలో 24, 25, 22 వార్డులకు చెందిన రోగులు వైద్య పరీక్షలు చేయించుకుంటారు. ఇటీవల స్పెషలిస్ట్ వైద్యులను తొలగించడంతో వీరంతా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రత్యేక వైద్యులు ఉండటంతో అన్ని రకాల చికిత్సలు ఆరోగ్య కేంద్రంలో చేయించుకునే వారు. ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి రోగుల్లో నెలకొంది. వృద్ధులు దూరం వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

– గోవర్ధన్ , రేసపువానిపాలెం

స్పెషలిస్ట్‌ల సేవలను పునరుద్ధరించాలి



నాడు ప్రతి వార్డులో ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. పేదలకు పైసా ఖర్చు లేకుండా ఇంటి సమీపంలో స్పెషలిస్ట్ వైద్యం అందేది. కేజీహెచ్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆరోగ్య కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రస్తుతం స్పెషలిస్ట్ డాక్టర్లను తొలగించారు. దీంతో అన్నీ ఒక్క వైద్యుడే చూస్తున్నారు. స్పెషలిస్ట్ వైద్య సేవలను పునరుద్ధరిస్తే రోగులకు మేలు జరుగుతుంది.

– పి.దుర్గాప్రసాద్, అక్కయ్యపాలెం

తెరిపివ్వని జడివాన


సాయిరాంనగర్ సర్వీస్ రోడ్డుపై వర్షపు నీరు


ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా వర్షంలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

మురళీనగర్: గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షం సోమవారం కూడా తెరినివ్వలేదు. తెల్లవారుజాము నుంచే భారీ వర్షం కురవడం ప్రారంభమైంది. దీంతో మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో వర్షానికి ప్రజలు తడిసి ముద్దయ్యారు. సర్వీస్ రోడ్డు, జాతీయ రహదారిపై వర్షపు నీటి తాకిడి కొనసాగింది. మురళీనగర్‌లోని జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, ఏఎస్సార్ నగర్‌లోని కె.కాలనీ ఉన్నత పాఠశాల, బర్మా క్యాంప్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలతోపాటు పలు ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. రోజంతా వర్షం కురవడంతో ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా హైవేపై వర్షంలో తడుస్తూ బస్సుల కోసం వేచి ప్రయాణికులు వేచి ఉన్నారు. జాతీయ రహదారిలో వాహనాలు విపరీతమైన వేగంతో దూసుకెళ్లడంతో బస్‌స్టాపుల్లో వేచి ఉన్న ప్రయాణికులపై వర్షపు నీరు తుళ్లిపడి ఇబ్బంది పడ్డారు.


ఎస్ఎంసీ హైస్కూల్‌లో చిత్తడిగా మైదానం

విద్యార్థుల ఒక్కట్లు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పీఅండ్‌టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్ మైదానం నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి బురదమయమైంది. దీంతో విద్యార్థులు గ్రౌండ్‌లోకి వెళ్లాలంటే భయపడతున్నారు. మైదానంలో పూర్తిగా వర్షపు నీరు చేరడంతో చిత్తడిగా మారింది. దీంతో విద్యార్థులు పాఠశాలకు వచ్చినప్పుడు జారిపడుతున్నామని వాపోతున్నారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ సేవలు

మురళీనగర్: మురళీనగర్‌లోని వార్డు సచివాలయాల్లో మంగళవారం నుంచి ఆధార్ సేవలు ప్రారంభమవుతాయని మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో మార్పులు, ఇతర సమస్యలు పరిష్కరించుకోవడానికి ఈ ఏర్పాట్లు చేశామని ఈ నెల 27వ తేదీ వరకు సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆధార్‌కు మొబైల్ నెంబర్, ఈ–మెయిల్ ఐడీ లింక్, బయోమెట్రిక్(ఫొటో, ఐరిష్, ఫింగర్ ప్రింట్) అప్‌డేట్, పేరు మార్పు(రుజువు తప్పనిసరి), పుట్టిన తేదీ మార్పు(రుజువు తప్పనిసరి), జెండర్ మార్పు, ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్, చిరునామా మార్పు(రుజువు తప్పనిసరి), కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్ కార్డు డౌన్‌లోడ్ వంటి సేవలు అందుబాటులో వస్తాయన్నారు. ఇందుకు రూ.50 నుంచి రూ.100 వరకు రుసుము ఉంటుందని చెప్పారు. ఆధార్ క్యాంప్‌లో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి 10 ఏళ్లకు ఒకసారి ఆధార్ అప్‌డేట్ తప్పనిసరిగా చేసుకోవాల్సి ఉందన్నారు.

స్వధర్మాచరణ, సేవతోనే మానవ జన్మ సార్థకత


వివిధ కోర్సులు పూర్తిచేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న గురుప్రసాద్, చింతలపాటి సత్యదేవ్

తాటిచెట్లపాలెం: స్వధర్మాచరణ, నిస్వార్థసేవ, దైవారాధన అనేవి మానవ జన్మ సార్థకతకు దోహదపడతాయని వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం) డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో జగద్గురు పీఠం సోదర బృందం సోమవారం నిర్వహించిన మాస్టర్ పార్వతీకుమార్ సతీమణి కృష్ణకుమారి 74వ జయంతి ఉత్సవ సభలో ఆయన మాట్లాడారు. మాస్టర్ పార్వతీకుమార్ సంకల్పంతో సంస్కృతి సదన్‌ను స్థాపించి, ఇప్పటివరకు 1,802 మంది నిరుద్యోగ మహిళలకు వివిధ వృత్తి విద్యల్లో ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్య అతిథి ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కంభంపాటి చంద్రశేఖర గురుప్రసాద్ మాట్లాడుతూ మాస్టర్ ఇ.కె. చూపిన మార్గంలో మాస్టర్ పార్వతీకుమార్ మార్గదర్శకత్వంలో జగద్గురు పీఠం, ధనిష్టా ఫౌండేషన్ వంటి సంస్థల ద్వారా అనేక కేంద్రాల్లో, విదేశాల్లో కూడా సేవలను అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ టైలరింగ్, మెహందీల్లో శిక్షణ పొందిన 49 మంది మహిళలకు ధ్రువపత్రాలను, కొందరికి కుట్టుమిషన్లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఉషారాణి, ట్రస్ట్ ప్రాంతీయ గణపతి ఎం.ఎస్.ఆర్.స్వామి, మహిళా కేంద్రం నిర్వాహకురాలు దాట్ల రాధ, జన శిక్షణ సంస్థాన్ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం


ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షం


కూలిన చెట్టు కింద నుజ్జయిన కారు

- తప్పిన పెను ప్రమాదం
- కారు, దుకాణాలు ధ్వంసం

మద్రిపాలెం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా 53వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద సోమవారం ఉదయం ఓ భారీ వృక్షం నేలకొరిగింది. అక్కడే సమీపంలో ఉన్న ఓ కారుపై, ఓ ఇంటి రక్షణ గోడపై ఆ చెట్టు కూలిపోవడంతోపాటు టీ స్టాల్, దుకాణాలు, విద్యుత్ స్తంభాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అప్పుడే టీ స్టాల్ తెరవడానికి వచ్చిన బాధితుడు ఎల్లారావు పెద్ద ప్రమాదమే తప్పిందని, ఈ ఘటనలో తన షాపు పడిపోయిందని వాపోయాడు. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై విద్యుత్ విభాగ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ ఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. కూలిన చెట్టును సోమవారం సాయంత్రానికి అధికారులు తొలగింపజేశారు.

సన్మార్గం వైపు నడిపేది సాహిత్యం


సుగుణరావును సత్కరిస్తున్న డాక్టర్ కూటుకుప్పల సూర్యారావు

సీతంపేట: సమాజాన్ని సన్మార్గపు జీవనశైలి వైపు తిప్పగల శక్తి సాహిత్యానికి ఉందని పద్మశ్రీ డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. మక్కెన రామ సుబ్బయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో దశమ సాహితీ పురస్కారాల సభ జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పూర్వకాలంలో రాజులు కవులను, రచయితలను ప్రోత్సహించేవారన్నారు. ప్రస్తుత కాలంలో డాక్టర్ మక్కెన వంటి సాహితీ పోషకులు కవులను, రచయితలను పురస్కారాలతో గౌరవిస్తున్నారని అభినందించారు. విశిష్ట అతిథి వి.రాజారామ్మోహన్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఆంగ్ల భాష మోజులో పడి తల్లిదండ్రులు తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తేనె కంటె తీయనైన తెలుగు భాష పరిరక్షణకు తెలుగు వారందరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు మక్కెన శ్రీను పదేళ్లుగా సంస్థ ద్వారా చేపట్టిన సాహిత్య కృషిని వివరించారు. అనంతరం సాహిత్య పురస్కారాలకు ఎంపికైన డాక్టర్ ఎం.సుగుణరావు, లేదాళ్ల రాజేశ్వరరావు, బండారు రాజ్ కుమార్, కొమ్ముల వెంకట సూర్యనారాయణ, ముని సురేష్‌లను ఘనంగా సత్కరించారు. శిరేల సన్యాసిరావు సభకు అధ్యక్షత వహించగా.. మేడా మస్తాన్‌రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు.

రోడ్ల మీదే కార్ల పార్కింగ్

నిత్యం జనాలతో రద్దీగా ఉండే రహదారులు కార్ల పార్కింగ్‌తో నిండిపోతున్నాయి. రోడ్లకు సగానికి పైగా ఆక్రమించి కార్లను నిలిపి షాపింగ్‌లకు వెళ్లిపోతున్నారు. దీంతో ప్రధాన ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రధానంగా ఆశీల్‌మెట్ట నుంచి సిరిపురం మధ్యలోను, జైలు రోడ్డు నుంచి డాబాగార్డెన్స్, డైమండ్ పార్క్ నుంచి ఫ్లైవోవర్ రోడ్డులో ఇష్టానుసారంగా కార్ల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ట్రాఫిక్ సిబ్బంది వాహనదారులను వారించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. రాజకీయ నాయకుల పేర్లు చెప్పి బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో పోలీసులు సైతం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వారిని పట్టించుకోవడం లేదు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం






'కిల్కారీ'తో తల్లీబిడ్డల ఆరోగ్యం

మహారాణిపేట: తల్లీబిడ్డల ఆరోగ్యానికి కిల్కారీ సేవలు దోహదపడుతున్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. రేసపువానిపాలెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న ఆశా, నోడల్ అధికారులకు సోమవారం కిల్కారీ మొబైల్ అకాడమీ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాతా, శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారీ సేవలు వినియోగిస్తున్నామన్నారు. ఈ వాయిస్ కాల్స్ సేవలతో తల్లీ శిశు ఆరోగ్యానికి భద్రత కలుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు, శిశువులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేస్తూ కిల్కారీ పేరిట వాయిస్ కాల్స్ వచ్చేలా ప్రభుత్వం రూపకల్పన చేసిందని డీఎంహెచ్‌వో వివరించారు.


మాట్లాడుతున్న లంకపల్లి రాజు, చిత్రంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ లంకపల్లి రాజు మాట్లాడుతూ గర్భిణిగా స్థానిక ఏఎన్ఎం దగ్గర వివరాలు నమోదు చేసుకున్న సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌కు ఈ కిల్కారీ వాయిస్ కాల్స్ వస్తాయన్నారు. గర్భిణుల్లో తలెత్తే ఎన్నో సందేహాలను నివృత్తి చేసే విధంగా వాయిస్ కాల్ సందేశం ఉంటుందన్నారు. నాలుగు నెలల గర్భిణి నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారీ కార్యక్రమాన్ని డిజైన్ చేశారని చెప్పారు.

పేరుకుపోతున్న చెత్త


సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపం రోడ్డులో చెత్త కుప్పలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధారలోని క్షత్రియ కల్యాణ మండపం ప్రధాన రహదారుల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఒక పక్క వర్షాలు కురుస్తుంటే.. మరో పక్క నగరంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. పేరుకుపోతున్న చెత్త తొలగింపును పారిశుధ్య అధికారులు పట్టించుకోకపోవడంతో డస్ట్ బిన్లు నిండిపోయి దుర్గంధం వెలువడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయింది. అటుగా రాకపోకలు సాగిస్తున్న వారు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి చెత్త పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

